క్లుప్తంగా

రోడ్డు భద్రతపై అవగాహన



నిజాంపేట్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

నారాయణఖేడ్: నిజాంపేట్‌లో శనివారం రోడ్డు భద్రత వారోత్సవాలను ప్రారంభించారు. ఖేడ్ మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, సర్పంచ్ జగదీశ్వరాచారి, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు, సంగారెడ్డి నాందేడ్ అకోలా 161 జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టిన కేఎస్‌ఆర్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ సిబ్బందితో కలిసి గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

దివ్యాంగులను ఆదుకోవాలి

అర్చకుడికి స్కూటీని బహూకరించిన నీలం మధు



స్కూటీని అందించిన నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: దివ్యాంగులను ఆదుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. బొల్లారం మున్సిపాలిటీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో దివ్యాంగ అర్చకుడు అనంతయ్యకు ఆయన శనివారం స్కూటీని బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా అర్చకుడు అనంతయ్యకు స్కూటీని బహుకరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సుజాత మహేందర్ రెడ్డి, బీరప్ప, తలారి కృష్ణ, ఉదయ్ భాస్కర్, స్వామి, శంకర్, శ్రీను, కృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ వైర్లు లేనిచోట్ల పతంగులు ఎగురవేయాలి'



విద్యుత్ తీగలకు చుట్టుకున్న గాలిపటాలను తొలగిస్తున్న సిబ్బంది

నారాయణఖేడ్: విద్యుత్ తీగలు లేనిచోట్ల పతంగులు ఎగురవేయాలని ఖేడ్ ట్రాన్స్‌కో అధికారులు సూచించారు. పతంగులు విద్యుత్ తీగలను చుట్టుకుంటే వాటిని లాగడం వల్ల తీగలు ఒకదానికొకటి తగిలి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫీజులు ఎగిరిపోతాయన్నారు. దీంతో విద్యుత్‌సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతాయని చెప్పారు. ఇళ్ళ, మిద్దెలపై తీగలు లేని చోట మాత్రమే పతంగులు ఎగురవేయాలని కోరారు. శనివారం ఖేడ్‌లోని విద్యుత్ తీగలకు చుట్టుకున్న పతంగులను మున్సిపల్, విద్యుత్ విభాగం సిబ్బంది వాటిని తొలగించారు.

'సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం'



చెక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయికోడ్(అందోల్): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం లాంటిదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బసవరాజ్ పాటిల్, శ్రీకాంత్ అన్నారు. రాయికోడ్‌లో శనివారం జంమ్గికి చెందిన కాపు సంగారెడ్డికి రూ.14,000లు, ఎం.స్వప్నకు రూ.60,000ల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబాలు వైద్యం కోసం ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఉండడం కోసం ఈ సీఎంఆర్‌ఎఫ్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశం, సంగమేశ్వర్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన హన్‌మాన్ ఆలయం



ఆలయంలో బారులు తీరిన భక్తులు

నారాయణఖేడ్: కొండాపూర్‌లోని విశిష్ట చరిత్ర గల హనుమాన్ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ప్రతీ శనివారం వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలోనే పాల్గొన్నారు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సంక్రాంతి సెలవులు ఉండటంతో భక్తుల రద్దీ భాగాపెరిగింది. దీంతో భక్తులు బారులుతీరి హనుమాన్ ప్రతిమను దర్శించుకున్నారు. అభిషేకం, పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదవితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

క్రీడలతోనే శారీరక దారుఢ్యం



గెలుపొందిన జట్టుకు బహుమతి అందజేస్తున్న దామోదర రాజనర్సింహా

పటాన్‌చెరు టౌన్: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పటాన్‌చెరు సీఐ వేణు గోపాల్ రెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం, లక్డారంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్నాడు. అనంతరం సీఐ మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శరీర ధారుఢ్యానికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రారం గ్రామ సర్పంచ్ సుధీర్ రెడ్డి, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.



సీఐను సన్మానిస్తున్న టోర్నమెంట్ నిర్వాహకులు

రాయికోడ్(అందోల్): పీపడ్‌పల్లి గ్రామంలో స్థానిక భవాని యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశ్ ప్రారంభించారు. టోర్నమెంట్‌లో 28 జట్లు తలపడనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఫైనల్ మ్యాచ్‌ను నిర్వహిస్తారన్నారు. విజేతలకు రూ.25,000ల నగదు, మెమోంటోను, రన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.12,000లు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.6,000ల నగదు, మెమోంటో అందజేస్తారని నిర్వాహకులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ఏడుకొండలు, రాయికోడ్, హద్నూర్ పోలీస్ అధికారులు, సిబ్బంది నిర్వాహకులు పాల్గొన్నారు.

వట్‌పల్లి(అందోల్): క్రీడలతోనే శారీరక దారుఢ్యం, మానసికోల్లాసం లభిస్తుందని మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహా అన్నారు. బిజిలీపూర్ గ్రామంలో జరిగిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి కనబర్చాలన్నారు. ప్రతి క్రీడల్లోనూ గెలుపోటములు సహజమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో చైతన్యం తీసుకురావడానికి ఇటువంటి క్రీడలు దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్ జ్యోషి, అందోల్ జోగిపేట కౌన్సిలర్ చిట్టిబాబు, మాజీ స్కోర్ చైర్మెన్ పి.సంగమేశ్వర్, మాజీ సర్పంచ్ అశోక్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు, సంగప్ప, బస్వరాజ్, నాయకులు బసంత్‌రావు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్‌ల ఆవిష్కరణ



చిలప్‌చెడ్(నర్సాపూర్): చండూర్ ఆలయంలో కేలండర్ ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు



కౌడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్నలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చండూర్ గ్రామంలోని రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో శనివారం దేవాలయ కేలండర్ ఆవిష్కరించారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సాయిరెడ్డి గారి వెంకట్‌రెడ్డి, భజన భక్తుల ఆధ్వర్యంలో కేలండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజ్‌కుమార్, సొసైటీ మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మాణయ్య, రమేశ్, గణేశ్, శివస్వాములు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో మిత్తయ్యల్‌వార్ ఐక్యవేదిక నూతన సంవత్సర కేలండర్‌ను శ్రీరాయగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గ్రామ ఇన్‌చార్జ్ సర్పంచ్ రాజేందర్, సంఘంద నాయకుడు రాములు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీశైలం, శ్రీనివాస్, విష్ణు, రమణ తదితరులు పాల్గొన్నారు.

దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు

మునిపల్లి(అందోల్): సంక్రాంతి సందర్భంగా దేవాలయాల్లో భక్తులు దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం భోగి సందర్భంగా భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అంతారం జీవన్ముక్త సంస్థానంలో పాండు రంగ విఠలేశ్వర, రుక్మాబాయి, జీవన్ముక్త మహారాజ్ సంస్థాన్ పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహారాజ్ అధ్వర్యంలో భక్తులు పూజలు నిర్వహించారు. మక్తక్యాసారంలో ఆత్మానందాశ్రమంలో పరమహంస పరివ్రజకాచార్య మదనానంద సరస్వతీ, శ్రీశ్రీశ్రీ పూజ్య పాద గురు రాజయోగి వెంకటస్వామి గురుమూర్తులకు ఆశ్రమ భక్తులు పూజలు నిర్వహించారు.

ఒత్తిడి పెంచే హామీపత్రం వెనక్కి తీసుకోవాలి

నారాయణఖేడ్: ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేసే హామీపత్రాన్ని వెనక్కి తీసుకోవాలని తపస్ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి అన్నారు. నారాయణఖేడ్‌లో శనివారం తపస్ ఉపాధ్యాయ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా కాలంగా ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీల పట్ల ఎదురు చూస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేయాలని, అదే విధంగా ఉద్యోగులకు ఇవాల్సిన డీఏలు చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా బాధ్యులు చంద్రకాంత్, చంద్రశేఖర్, జగదీశ్, కిరణ్, భూమయ్య, విష్ణు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం నూతన కార్యవర్గం

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు గ్రామ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వల్లపురెడ్డి రాంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రేకులపల్లి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చౌడిచెర్ల వెంకట్రామిరెడ్డి, కార్యదర్శిగా రాసారపు రవీందర్‌డ్డి, కోశాధికారిగా సూదిరెడ్డి రాంరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా నారాయణరెడ్డి ఎన్నికయ్యారు.

'మద్యం సేవించి వాహనాలు నడపరాదు'

ఝరాసంగం(జహీరాబాద్): మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎస్‌ఐ రాజేందర్ రెడ్డి సూచించారు. శనివారం మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామ శివారులో వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎస్‌ఐ మల్లేశ్వర్, చంద్రప్ప, కృష్ణ, రామ్ చందర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): వివిధ కుల సంఘాల భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి శనివారం వినతిపత్రం సమర్పించారు. మండల పరిధిలోని గోమారం పర్యటనకు వచ్చిన వారికి గ్రామంలో కురుమ సంఘం, ముదిరాజ్ సంఘం భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కుల సంఘాల నాయకులు వినతిపత్రం సమర్పించారు. అందుకు చైర్ పర్సన్, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ లావణ్య మాధవారెడ్డి చెప్పారు.

వైభవంగా అయ్యప్ప స్వామి స్వర్ణాభరణ ఊరేగింపు



ఏనుగుపై ఊరేగిస్తున్న దృశ్యం



ఊరేగింపులో ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్ : అయ్యప్ప స్వామి స్వర్ణాభరణ ఊరేగింపు ఏనుగు అంబారిపైన శనివారం సంగారెడ్డి పట్టణంలో వైభవంగా నిర్వహించారు. మణికంఠ అయ్యప్ప ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సాహితీ రామ్ ఆధ్వర్యంలో నవరత్న దేవాలయంలో ఉదయం మహా పడిపూజ నిర్వహించారు. అనంతరం సంజీవ్ నగర్ లోని హనుమాన్ దేవాలయం నుంచి నవరత్న ఆలయం వరకు అయ్యప్ప స్వామి స్వర్ణాభరణ ఊరేగింపు ప్రారంభించారు. బ్యాండ్, చప్పుళ్లు, భజనలు, నృత్యాలు చేసుకుంటూ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్ రెడ్డి, డీసీసీ అధక్షురాలు నిర్మల, బీజేపీ సంగారెడ్డి ఇన్‌చార్జ్ దేశ్పాండే, అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చెత్తను మున్సిపల్ సిబ్బందికి అందించాలి

శానిటరీ అధికారి శ్రీనివాస్



దుకాణదారుడిచేత చెత్త ఎత్తివేయిస్తున్న దృశ్యం

నారాయణఖేడ్: ఇళ్లు, దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలనుంచి వెలువడే చెత్తను చెత్త తరలింపు ఆటోల్లోనే వేయాలని ఖేడ్ మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ తెలిపారు. శనివారం పట్టణంలో చెత్త సేకరణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయిపల్లి రోడ్డుమార్గంలో ఓ దుకాణదారుడు దుకాణం ఎదుట చెత్తను వేసినట్లు దాన్ని గుర్తించి ఆ దుకాణదారునిచేత ఎత్తించి చెత్త తరలించే ఆటోలో వేయించినట్టు చెప్పారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన కోరారు.

జీవవైవిద్య సంరక్షకులకు సత్కారం



సుధాబాయిని సత్కరిస్తున్న సంజనారెడ్డి

జహీరాబాద్: వ్యవసాయంలో జీవవైవిద్యాన్ని కాపాడుతూ చిరుధాన్యాల పంటలు పండిస్తున్న మహిళా రైతులను డీడీఎస్ తరఫున ఘనంగా సత్కరించారు. శనివారం మొగుడంపల్లి మండలంలోని జాంగార్‌బౌలి తండాలో నిర్వహించిన పాత పంటల జాతరలో అదే తండాకు చెందిన సుధాబాయిని ప్రిన్సిపల్ సైంటిస్టు సంజనారెడ్డి సత్కరించారు. లచ్చానాయక్ తండాకు చెందిన మహిళా రైతు జ్యోతి బాయిని సర్పంచ్ రమేష్‌రెడ్డి, న్యాల్‌కల్ మండలంలోని శంశల్లాపూర గ్రామానికి చెందిన మరియమ్మను సర్పంచ్ రాంశెట్టి చౌహాన్‌లు సత్కరించారు. పాత పంటల సాగు అన్నింటికి పరిష్కారం లభిస్తుందని తండా రైతులు జగ్గమ్మ, శాంతమ్మలు అన్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటా

మాజీ డిప్యూటీ సీఎం దామోదర



గోపాల్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న దామోదర రాజనర్సింహ

జోగిపేట(అందోల్): కన్‌సాన్‌పల్లి గ్రామ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నక్క గోపాల్ అనారోగ్యంతో మృతి చెందడంతో శనివారం మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ మృతుడి కుటుంబ సభ్యలను పరామర్శించారు. అధైర్య పడకూడదని అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి, మహిపాల్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ బాలయ్య ఆయన వెంట ఉన్నారు.

సీసీఐ ద్వారా పత్తి కొనాలి

మునిపల్లి(అందోల్): సీసీఐ కేంద్రాల్లో పత్తిపంటను కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దలోడి బస్వరాజ్ పటేల్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. శనివారం ఆయన బుదేరాలో మాట్లాడారు. సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సీసీఐ కేంద్రాల్లో క్వింటాల్ పత్తి సుమారు రూ.16.350ల చొప్పున కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ముగ్గులతో సందడి

సంక్రాంతి పండగ విశిష్టతను తెలిపేలా అందమైన రంగవల్లులను వేసిన వారి ఫొటోలను సాక్షి పత్రిక ప్రచురిస్తోంది. సంగారెడ్డి జిల్లాలోని పలు మండలాల్లో యువతులు, మహిళలు వేసిన ముగ్గుతో దిగిన సెల్ఫీ ఫొటోలు.. పాఠకుల కోసం.



జిన్నారం: దోమడుగులోముగ్గులను పరిశీలించిన సర్పంచ్ రాజశేఖర్



సంధ్యా సిరి బాబు, సంగారెడ్డి



వి. విజయ లక్ష్మి, రామచంద్రపురం



దుర్గేశ్వరి, కన్సాన్ పల్లి



వి. విజయ లక్ష్మి, రామచంద్రపురం



లత, జహీరాబాద్

గ్రామాల్లో సంక్రాంతి సంబరం



నారాయణఖేడ్‌లో కిటకిటలాడుతున్న పతంగుల దుకాణాలు



ముగ్గులు వేస్తున్న బాలికలు

మునిపల్లి(అందోల్): మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం భోగి పండుగ నిర్వహించారు. సాధారణంగా సంక్రాంతి సమయంలో వివిధ రకాల పంట చేతికొచ్చేస్తుంది. దీంతో ధనిక, పేద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ సంక్రాంతి సంతోషంగా జరుపుకుంటారు.

ప్రత్యేక వంటలు

సంక్రాంతి సందర్భంగా కుటుంబ ఆర్థిక పరిస్థితిని బట్టి ప్రజలు వివిధ రకాల పిండి వంటకాలు చేస్తారు. బియ్యం, పిండి నువ్వులు, వోమ, కలిపి వీటిని తయారు చేస్తారు. సంక్రాంతి పిండి వంటకాల్లో పూరిలు, గారెలు, బజ్జిలు గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎక్కువగా చేస్తారు.

నోరూరించే తీపి వంటలు:

నోరూరించే వివిధ రకాల తీపి వంటలను ప్రజలు సంక్రాంతి రోజున చేస్తారు. తెల్లవారు జాము నుంచి ఇంటి ముందు వివిధ రకాల ముగ్గులు వేసి పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌లో సంక్రాంతి వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. మండలంలోని గ్రామాల్లో ఇళ్ల ఎదుట రంగురంగుల ముగ్గులు వేశారు. సాయంత్రం భోగి మంటలు వేసుకున్నారు. యువకులు, చిన్నారులు పతంగులు ఎగురవేశారు. పట్టణంలోని పతంగుల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

సంక్షిప్త వార్తలు

◆ **10 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు**

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం 10 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు వైద్యసిబ్బంది మనోహర్ తెలిపారు.

◆ **మకర జ్యోతిని వీక్షించిన భక్తులు**

జోగిపేట(అందోల్): శబరిమలలోని పొన్నాంబల మేడలో మకరజ్యోతిని శనివారం సాయంత్రం 6.46 గంటలకు భక్తులు దర్శించుకొని తరించిపోయారు. ఈ క్రమంలోనే జోగిపేట అయ్యప్ప దేవాలయంలో టీవీద్వారా మకర జ్యోతిని భక్తులు వీక్షించారు. ప్రతి సంవత్సరం 14న మకర జ్యోతిని భక్తులు దర్శించుకోవడం అనవాయితీగా మారింది. భక్తులు మూడు సార్లు జ్యోతిని దర్శించుకున్నారని నిర్వాహకులు తెలిపారు.

◆ **కూడల సంగంకు తరలిన బసవ భక్తులు**

జహీరాబాద్ టౌన్: కర్నాటకలోని కూడల సంగంలో 32వ శరణ సమ్మేళనంలో పాల్గొనేందుకు జహీరాబాద్ నుంచి బసవ భక్తులు తరలివెళ్లారు. విశ్వగురువు జన్మస్థానమైన కూడల సంగంలో ప్రతి సంవత్సరం పెద్దెత్తున శరణ సమ్మేళనం జరుగుతుంది. రాష్ట్రీయ బసవదళ్ తెలంగాణ అధ్యక్షుడు శంకర్‌పాటిల్ ఆధ్వర్యంలో, జహీరాబాద్ రాష్ట్రీయ బసవదళ్ అధ్యక్షుడు డాక్టర్ శరణప్ప వెళ్లిన వారిలో ఉన్నారు.

◆ **ఘనంగా భోగి**

జహీరాబాద్ టౌన్: పట్టణంలో శనివారం భోగి సంబరాలు చేసుకున్నారు. భోగి మంటలను పెట్టుకుని సందడి చేశారు. పస్తాపూర్ మహింద్ర కాలనీలో శ్రీవెంకటేశ్వర ఆలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు.

◆ **రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి**

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నామని పటాన్‌చెరు ట్రాఫిక్ సిఐ ప్రవీణ్ రెడ్డి అన్నారు. శనివారం నేషనల్ హైవే అధికారులతో కలిసి లక్డారం కమాన్ వద్ద పరిశీలించారు.

◆ **కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి**

రాయికోడ్(అందోల్): 18 నుంచి నిర్వహించే కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశం సూచించారు. వారు మాట్లాడుతూ డాక్టర్లు సంధ్య, యాస్మిన్‌ల ఆధ్వర్యంలో రెండు వైద్య బృందాలను ఏర్పాటు చేశారన్నారు.